పని చేసినా.. పైసలొస్తలేవు!

- నత్తనడకన ఉపాధి పనులు • నాలుగు నెలల పెండింగ్ రూ. 20.58 లక్షలు
- అవస్థలు పడుతున్న కూలీలు • పట్టించుకోని సంబంధిత అధికారులు
- పెరిగిన పని గంటలు • ఎక్కువ సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నా...
- పనులకు హాజరయ్యేది తక్కువ మందే, కూలీ తక్కువని మొగ్గుచూపని వైనం


చిగురుమామిడి నర్సరీలో ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపుతున్న ఉపాధి కూలీలు

చిగురుమామిడి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిరుపేదలు వలస వెళ్లకుండా ఉన్న గ్రామాల్లోనే పనులు చేసుకుంటూ జీవించాలనే ఉద్దేశంతో జాతీయ ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టింది. కానీ కూలీ డబ్బులు పూటగడవడానికి సరిపోవడంలేదు. మండలంలోని 17 గ్రామాల్లో 9,500 జాబ్‌కార్డులున్నాయి. 5,000 మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారు. గత నెలలో 250 కూలీలు మాత్రమే పనులకు హాజరయ్యారు. కూలీ తక్కువగా వస్తుందంటూ ఇతర పనులకు వెలుతున్నారు. పనిగంటలు పెరిగినప్పటికీ కూలీ తక్కువగా వస్తుందనే భావనతో ఈజీఎస్ పనులకు మొగ్గుచూపడంలేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లోని నర్సరీల్లో మట్టినింపడం, గతంలో నాటిన మొక్కల చుట్టూ పాదులు తీయడం, కంచె ఏర్పాటు, ఇతర పిచ్చిమొక్కలను తొలగించడం చేస్తున్నారు. మరోవైపు నాలుగు నెలల నుంచి చేసిన పనులకు డబ్బులు రావడంలేదు. నిత్యావసర సరుకుల కోసం చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి జనవరి వరకు రూ. 20.58 లక్షలు చెల్లించాల్సి ఉంది. వీటి కోసం కూలీలు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.

- గత రెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు మూడు కోట్లు విడుదల చేయగా రూ.2.5 కోట్లు మెటీరీయల్ కాంపోనెంట్ కింద ఖర్చు కాగా మిగిలినవి కూలీలకు చెల్లించారు. కానీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.
- రెండేళ్ల క్రితం కేటాయించిన బడ్జెట్‌లోనే కూలీలు పనులకు వెళ్తున్నారు. గతేడాది సెప్టెంబర్ వరకు ఈజీఎస్ కేంద్రం బృందం చేపట్టిన పనులకు ఆడిట్ నిర్వహించింది. అదే నెలలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక మహాసభ నిర్వహించి చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులకు ఆమోదం పొందారు.
- ఈజీఎస్ కూలీలకు పనిభారం పెరిగింది. గతంలో రెండు నుంచి మూడు గంటలు పనులు చేస్తే ప్రస్తుతం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తున్నారు.
- సెల్‌ఫోన్‌లో మస్టర్ ఆన్ చేసి ఫోటో తీయాలి, మధ్యాహ్నం మరోమారు ఆన్‌లైన్‌లో మస్టర్ ఆన్ చేసి హాజరు వేయాల్సి ఉంటుంది. రోజూ ఇంత చేస్తున్నప్పటికీ రూ.150 నుంచి రూ.210 కూలీ చెల్లిస్తున్నారు.
- ఇచ్చే కూలీ డబ్బులు సకాలంలో రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణకు సరిపవడంలేదని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మాస్టర్ రోల్ మేనేజ్ సిస్టం) కింద పది మంది కూలీలు పనికావాలని పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తులు సమర్పిస్తే వారంలోపు పని కల్పిస్తున్నారు. గతంలో కాకుండా పదిమంది కూలీలను గ్రూపుగా ఏర్పాటు చేస్తున్నారు.
- కూలీలకు చెల్లించాల్సిన నాలుగు నెలల రూ.20.58 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంత వరకు చెల్లించకపోవడంతో కూలీలు నరకయాతనపడుతున్నారు. చేసిన పనులకు డబ్బులు రాక జీవనం వెల్లదీస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను సంప్రదిస్తే బ్యాంక్ ఖాతాకు ఆధార్‌నంబర్ లింకు చేస్తేనే డబ్బులు వస్తాయని, పెండింగ్ డబ్బులు బ్యాంక్‌లో ఉన్నాయని చెబుతుండటంతో చేసేదిలేక కూలీలు నిమ్మకుండిపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



పనులు చేసినా పైసల్ సరిగా రావడంలేదు. రోజువారి ఖర్చులకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నం. మూడు వారాల పైసలు రావాలి. ఆరోగ్యం బాగాలేక మందులకు ఇబ్బంది అవుతోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు.

– కట్ల రాయమల్లు, కూలీ, ముదిమాణిక్యం

చేతిలో చిల్లిగవ్వలేదు



ఐదు వారాల పైసలు రావాలి. అయినా ప్రతిరోజు పనికి పోతున్నాను. చేతిలో డబ్బులు లేక ఇబ్బందిగా ఉంది. నిత్యావసర సరుకులు, మందులకు డబ్బులు లేవు. చేసేది లేక అప్పు చేసి కాలం వెల్లదీస్తున్నాం.

– మొలుగూరి మల్లయ్య, కూలీ, బొమ్మనపల్లి

తనిఖీ చేస్తున్నాం



మాస్టర్ రోల్ వచ్చిన ఐదు రోజుల్లోనే ఆన్‌లైన్ చేస్తున్నాం. లేదంటే పైఅధికారుల నుంచి ఒత్తిడి వస్తోంది. బడ్జెట్ కొరత వల్ల కూలీ డబ్బులు విడుదల కావడంలేదు. ఎప్పటికప్పుడు మానిటరింగ్, చేసిన పనులు తనిఖీ చేస్తున్నాం.

– నర్సయ్య ఎంపీడీవో, చిగురుమామిడి

క్లుప్తంగా

కంటి వెలుగు కేంద్రం తనిఖీ


కేంద్రాన్ని పరిశీలిస్తున్న వినీత

గన్నేరువరం: గన్నేరువరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో వినీత తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత మందికి పరీక్షలు చేశారని తెలుసుకున్నారు. 1,225 మందికి పరీక్షలు చేసి 202 మందికి కళ్లద్దాలు అందజేశామని, 266 మందికి ఇవ్వాల్సి ఉందని డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నగేష్, అంజన్‌గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు


పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్: మంత్రి కేటీఆర్ బహిరంగ సభ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అప్రజాస్వామికమని నాయకులు వాపోయారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, సంపత్, గట్టు శ్రీదర్, అశోక్, అపరాజు శ్రీనివాసరావు, బోగం నారాయణ అరెస్టయిన వారిలో ఉన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

సైదాపూర్: బాలికలు ఆత్మ స్థైర్యంతో ముందుకెళ్లాలని వెన్కెపల్లి జెడ్పీ హెచ్‌ఎం ఖైరున్నీసా బేగం సూచించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను ఐసీపీఎస్ సోషల్ వర్కర్ రమేశ్ వివరించారు. ఆపదలో డయల్ 100, 181, చైల్డ్ లైన్ 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సర్పంచ్ గణేష్, కుమారస్వామి, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులకేనా దళితబంధు ?


సమావేశంలో మాట్లాడుతున్న యుగేందర్

శంకరపట్నం: బీఆర్ఎస్ నాయకులకే దళితబంధు ఇస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ ఆరోపించారు. కేశవపట్నంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పథకాన్ని ఎ మ్మెల్యే అనుచరులకే మంజూరు చేస్తున్నారని, నిరుద్యోగ భృతి అమలుకు నోచుకోలేదని, పేదలకు డబుల్‌బెడ్‌రూం, మూడెకరాల భూ పంపిణీ అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో అగ్రవర్ణ ప్రజాప్రతినిధులు, మానకొండూర్‌లో ఇసుకదందా కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దళితబంధు పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సహాయ కార్యదర్శి తిరుపతి, సాగర్, అనిల్‌కుమార్, సంపత్, వంశీ, మున్న, హరీశ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, నెహ్రూ యువకేంద్రం కో–ఆర్డినేటర్ ఎం.వెంకట రాంబాబు హాజరై, విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. యువత ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువశక్తి ప్రతినిధులు తొర్తి శ్రీనివాస్, అరవింద్, జయంత్, శివ, చందు, కమల్ పాల్గొన్నారు.

సమాచారం

ప్రారంభం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో నూతన తరగతి గదులు నిర్మించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభోత్సవం చేస్తారని ఎంపీపీ కొత్త వినీత తెలిపారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



చిగురుమామిడి: మండలంలోని ముల్కనూర్ వీఆర్ఏ తలారి శ్రీనివాస్ కుమారుడు అజిత్ సోమవారం రోడ్డు ప్రమాదానికి గురికాగా హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇతర రెవెన్యూ ఉద్యోగులు రూ. 50 వేలు సేకరించి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, ఇతరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

సైదాపూర్: ఉన్నతి పథకంలో కంపోస్టు, నర్సరీలపై ఇస్తున్న శిక్షణతో లబ్ధి పొందాలని సర్పంచ్ బత్తుల కొమురయ్య సూచించారు. మంగళవారం పెరుకపల్లిలో పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పెరుకపల్లిలో 2018–19లో ఉపాధి హామీ పథకంలో జిల్లాలో ఎక్కువ పనిదినాలు నమోదు కావడంతో 45 ఏళ్లలోపు స్త్రీలకు ఉపాధి శిక్షణ ఇస్తున్నామని ఏపీఎం కుమారస్వామి తెలిపారు. శిక్షణ కాలంలో ఉపాధి హామీ లేబర్ వేజ్ చెల్లిస్తామని, ఆసక్తి ఉన్న మహిళలు ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు బుక్ జిరాక్సుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఐకేపీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య, ఏపీఎం కుమారస్వామి, సీసీలు ఏపీలు, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో ఆర్ఎంపీ, పీఎంపీలు

రామడుగు: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ మంగళవారం రామడుగు మండల ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు విన్నవించుకున్నారు. గంగాధర మండలం బూరుగుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి. లక్ష్మణ్, బాబ్జీ, జిల్లా నాయకులు సంజీవరెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం, నాగరాజు, సత్యనారాయణ, రమేష్, రమణ పలువురు పాల్గొన్నారు.

తడి, పొడి సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దేవేందర్‌రెడ్డి

మానకొండూర్: మండలంలోని రంగపేట గ్రామంలో సీసీఎక్స్ పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వరి తడి, పొడి సాగు విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. సంస్థ క్లస్టర్ కో ఆర్డినేటర్ మర్రి దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. తడి,పొడి విధానం ద్వారా పొలంలో కార్బన్, మీథేన్, వాయువుల విడుదల, చీడ పురుగుల ఉధృతి తగ్గుతుందన్నారు. సాగుకు రైతులు ముందుకురావాలని, వాతావరణ మార్పులకనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపు పావని, ఉపసర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: ఏసీడీ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం మోపుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీల వసూల్ చేయడాన్ని నిరసిస్తూ నాయకులు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో చేశారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం 24 గంటల కరంట్ అని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. ఏసీడీ చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పులి అంజనేయులుగౌడ్, వెన్నం రాజమల్లయ్య, అశోక్, గంగయ్య, రాజేశం, రమేష్, సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


మాట్లాడుతున్న సబిత

రామడుగు: ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఎంపీపీ కవిత, తహసీల్దార్ రాజుకుమార్, సీడీపీవో కస్తూరి, సర్పంచ్ ప్రమీల, వైద్యులు రజిత, రమేష్, ఏపీఎం ప్రభాకర్, సూపర్‌వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్ల వివరాలు ప్రకటించాలి

కరీంనగర్: పదోన్నతులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేసినప్పటికీ అడక్వసీ వివరాలు ప్రకటించలేదని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి దయానంద్, పీఆర్ శ్రీనివాస్, శనిగరపు రవి అన్నారు. వెంటనే ఆ వివరాలను డీఈవో కరీంనగర్ సైట్‌లో పొందుపర్చాలని మంగళవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు.

హౌజ్ నిర్మాణానికి నిధులివ్వండి

విద్యానగర్: కరీంనగర్‌లో మినీ హజ్ హౌజ్ నిర్మాణానికి నిధులివ్వాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. మంగళవారం హైదరాబాద్ హజ్ హౌస్‌లో హజ్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కరీంనగర్‌తోపాటు ముస్లింలు మెజారిటీగా ఉన్న జిల్లా కేంద్రాల్లో మినీ హజ్ హౌస్‌ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలన్నారు. కమిటీ చైర్మన్ సలీం, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లాహ్ ఖాన్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, కౌసర్ మొహియుద్దీన్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పొంచి ఉన్న ప్రమాదం

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద జమ్మికుంట–మొగుళ్లపల్లి ప్రధాన రహదారి పక్కన కొన్ని నెలల క్రితం బాలవికాస పైపులైన్ కోసం భారీ గుంత తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఆర్అండ్‌బీ అధికారులు దృష్టిసారించి గుంత పూడ్చివేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారిపేరు : పొన్నం మధుసూదన్, జీపీ కార్యదర్శి
ఫోన్ నంబర్ 83094 60597

సర్వే పనులు నిలిపివేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

గన్నేరువరం: మిడ్‌మానేరు ప్రాజెక్టు కుడికాలువకు అనుసంధానంగా ఉపకాలువ 7 నిర్మాణానికి చేపట్టిన సర్వే నిలిపివేయాలని కోరుతూ ఖాసీంపేట, పారువెల్ల గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ బాపుసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయభూముల్లో సంబంధిత అధికారులు చేపట్టిన సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్లరేగడి భూములు కావడంతో ఇప్పటికే అధిక వర్షపాతం కారణంగా పంటలు పండించలేని పరిస్థితులు ఉన్నాయని, భూములపైగా భాగాన చెరువు, కుంట ఉందని, మళ్లీ కాల్వ నిర్మాణం చేపడితే కాలువలోని నీటితో భూములు జాలువారుతాయని పంటలు పండించలేని పరిస్థితి ఉంటుందని వాపోయారు. ఇటీవల వద్దూరు గ్రామస్తులు సైతం కాలువ నిర్మాణంపై అభ్యంతరం చెప్పారని, రైతుల విన్నపాలను పరిగణనలోకి తీసుకోవాని కోరారు. కార్యక్రమంలో రైతులు పీచు మల్లారెడ్డి, బద్దం బుచ్చిరెడ్డి, పీచు రాజిరెడ్డి, ఒరుగంటి సంపత్, రాజేంద్రప్రసాద్, జీవన్‌రెడ్డి, స్వామిరెడ్డి, కొటిల్య, రవీందర్‌రావు, బొజ్జ రాములు, ముత్తవ్వ, చౌదరి, నర్సవ్వ, రాజవ్వ పాల్గొన్నారు.

టీజీసీటీఏ ఆధ్వర్యంలో సన్మానం

శాతవాహనయూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం(టీజీసీటీఏ) ఆధ్వర్యంలో ఎస్సారార్ కళాశాలలో మంగళవారం పలువురిని సన్మానించారు. వాణిజ్య విభాగంలో గైడ్‌షిప్ పొందిన విజయగిరి భిక్షపతి, డాక్టర్ ఓదెలుకుమార్, రీసెర్చ్ గైడ్‌షిప్ పొందిన సతీశ్‌కుమార్, టీజీసీటీఏ ఈసీ మెంబర్‌గా ఎన్నికైన ముత్తన్నను సత్కరించారు. సంఘం ప్రతినిధులు భిక్షపతి, జి.కిశోర్‌కుమార్, భాస్కర్, అర్చన, పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం


జమ్మికుంట: శ్రీవేణుగోపాలస్వామి రుక్మిణి,సత్యభామ కళ్యాణం

జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత మందిరం వార్షికోత్సవం సందర్భంగా శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించగా పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దాతల సహాయ సహకారంతో మహా అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిదురాల శ్రీనివాస్, మురికి కొండయ్య, జనార్దన్ భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవం

రామడుగు: మండల కేంద్రంలోని షాపురం శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అష్టసఖి సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న చైర్మన్లు, ఎంపీపీ


గన్నేరువరం: పూజా కార్యక్రమంలో చైర్మన్లు, ఎంపీపీ

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామం శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం రెండోరోజు మంగళవారం ఆరాధన హోమం, శత కళశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, కేడీసీసీబీ డైరెక్టరు అలువాల కోటి, కాంతాల విక్రమ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొద్దు సునీల్, మల్లేశం లక్ష్మీగణపతిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్ఎస్ఎస్ మండల కో ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బలరాంరెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రయ్య, సహకార సంఘం డైరెక్టరురాంరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.